క్లుప్తంగా

బీచుపల్లిని సందర్శించిన డీసీసీబీ చైర్మన్



ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని గురువారం డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, పీఏసీఎస్ అధికారులు, ఆలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అలంపూర్ రూరల్: మండలంలోని లింగస్వాయి గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. మండలంలోని ఊట్కూర్, కోనేర్ గ్రామాలలో పర్యటించి మధ్యాహ్న భోజన పథకాన్ని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

మానవత్వం ఉంటే జీతాలు చెల్లించాలి



అలంపూర్: మున్సిపల్ అధికారులకు మానవత్వం ఉంటే కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్ద బాబు అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం అతిథి గృహంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించక పోవడం బాధాకరమన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, సీపీఐ నాయకులు ఫరుఖ్, గోపాల్, పరశురాం, దావీదు, వెంకట్రాముడు, వినయ్ ఉన్నారు.

తప్పెట్లమొర్సులో పశువైద్య శిబిరం



గట్టు: తప్పెట్లమొర్సులో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 28 మంది రైతులకు సంబంధించిన 89 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శంకరయ్య, వెటర్నరీ అసిస్టెంట్లు పృథ్వీరాజ్, కనకరాజు, లైవ్లీహుడ్ అధికారి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కమ్యూనిటీ మొబిలైజర్ పరమేష్ ఆచారి, రైతులు పాల్గొన్నారు.

అక్షర నిలయాలు.. అంగన్‌వాడీ కేంద్రాలు



గట్టు: అక్షర నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు రూపు దిద్దుకుంటున్నట్లు మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ నాగరాణి తెలిపారు. పోషణ మాసంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య నైపుణ్యాలను నేర్పిస్తూ వర్ణమాల, ఆల్ఫాబెట్స్, చదవడం, రాయడం, పలికించడం, గుర్తు పట్టడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించి, చిన్నారుల చేతులను పరిశుభ్రత చేయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, రాజేశ్వరి, సరస్వతి ఉన్నారు.

అందరికీ ‘సర్వేపల్లి’ ఆదర్శం

- డీఐఈఓ హృదయరాజు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జిల్లా ఇంటర్ విద్యా అధికారి హృదయరాజు పాల్గొని మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ అందరికీ ఆదర్శనీయమన్నారు. గురువారం ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, క్రీడా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఆర్‌టీయూ, తపస్, ఎస్టీటీ, యూటీఎఫ్, టీటీయూ, సోషల్ ఫోరం, ఎస్టీయూ తదితర సంఘాల నాయకులు సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌మార్గ్ రోడ్డులోని సర్వేపల్లి విగ్రహానికి, ఎంఈఓ కార్యాలయం ఎదుట సర్వేపల్లి విగ్రహానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో..

జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ విద్యానికేతన్, కాకతీయ, విశ్వభారతి, విశ్వేశ్వరయ్య, నోబుల్, మాంటిస్సోరి, ప్రగతి, శారద, అక్షర, విశిష్ట నోబుల్, సెయింట్ జాన్స్, సరస్వతి, సత్యసాయి, దయానంద, ఇండో ఇంగ్లిష్ తదితర పాఠశాలలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అయిజ: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని మండలం కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రపై ఉపన్యాస పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్‌ను అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



వల్లూరులో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్‌ఎస్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, భాగ్యలక్ష్మి, గోవర్ధన్‌శెట్టి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని కస్తూర్బాలో మహిళా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ గోపీలత మాట్లాడారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలో ఎంఈఓ శివప్రసాద్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి కాన్సెప్ట్ స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పేరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గౌరీశంకర్ మాట్లాడారు. సీనియర్ ఉపాధ్యాయులు నారాయణరావు, రాజ్యలక్ష్మిలను శాలువా పూలమాలతో సన్మానించారు.

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

ఎర్రవల్లి: మండలంలోని వల్లూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కావలి మణ్యం, ఉపాధ్యాయులు సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇటిక్యాల మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండల ఎమ్మార్సీ భవనం ఎదుట సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పీఆర్‌టీయూ టీఎస్ శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండవెల్లి: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 5 మంది ఎంపికై నట్లు ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో తక్కశిల ప్రధానోపాధ్యాయులు అనితాబాయ్, ఎస్ఏ దాదామియ్యా, ఉండవెల్లికి చెందిన గరీబ్ బాషా, కలుగోట్లకు చెందిన సత్యనారాయణ, శివమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న, హెచ్‌ఎం హేమలత పాల్గొన్నారు.



గట్టు కస్తూర్బాలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు



మాట్లాడుతున్న డీఐఈఓ హృదయరాజు



ఉప్పేరులో..



ఉండవెల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు



మల్దకల్‌లో సర్వేపల్లికి ఉపాధ్యాయుల నివాళి



అయిజలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సమాజంలో గౌరవప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి

- ఎంఈఓ అశోక్‌కుమార్



అలంపూర్ రూరల్: సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలంలో తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో వారిని ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబ్‌బాషా, మధు, రాజారెడ్డి, కల్యాణి, మరియమ్మ, రాముడు, శంకరమ్మ, హబీబాబేగం, రాజ్‌కుమార్‌లను ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి ఏటా అలంపూర్ మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయ వృత్తి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేరవేయడంలో కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, దాతలు వెంకట్రామయ్య శెట్టి, సుదర్శన్‌గౌడ్, డీ. రమేష్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయరాముడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కస్తూర్బాలో అవగాహన కార్యక్రమం



ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బాలో 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు పోషణ అభియాన్ కార్యక్రమంలో సీడీపీఓ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం కస్తూర్బాలో సీడీపీఓ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు రుచికరమైన భోజనం చేయాలని, సరైన సమయంలో భోజనం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల సూపర్‌వైజర్ ఆస్మా, ప్రిన్సిపల్ పరిమళ, బాలల సంరక్షణ అధికారి రవి, సఖి టీం స్వాతి, చైల్డ్ హెల్ప్‌లైన్ గిరి, కృష్ణ, సరోజ, కానిస్టేబుల్ ఖాదర్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో గురువారం ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఏ. సంపత్‌కుమార్ ప్రత్యేక నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, జిల్లా నాయకులు మహ్మద్ సిరాజ్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో విద్యుత్ స్తంభం మార్పిడి

అలంపూర్ రూరల్: సీఐ ఆదేశాల మేరకు అలంపూర్ ఇన్‌చార్జి ఎస్ఐ బాషా గ్రామాల సందర్శనకు వెళ్లారు. మండలంలోని బుక్కాపురంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభ గురించి గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో విద్యుత్ ఏఈతో మాట్లాడి వెంటనే స్తంభాన్ని మార్చి కొత్త స్తంభం ఏర్పాటు చేయించారు. పోలీసులకు, విద్యుత్ అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న 6 ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ పోల్స్ వేసినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని మద్దెలబండపెద్దతండా గ్రామాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను తండా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలోఎంపీఓ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, సిబ్బంది, పాల్గొన్నారు.

యువతకు యూత్ కాంగ్రెస్ భరోసా

ఎర్రవల్లి: యువతకు యూత్ కాంగ్రెస్ భరోసాగా ఉంటుందని అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలో అధ్యక్షుడి నియామకం కోసం చరవాణి ద్వారా యువతతో ఓట్లు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అమూల్యమైన ఓటు వేసి రాజ్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

కోతకు గురైన తుమ్మిళ్ల పైప్‌లైన్ రోడ్డు



కోతకు గురైన తుమ్మిళ్ల పైప్‌లైన్ రోడ్డు

రాజోళి: కురుస్తున్న వర్షాలకు తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి ఆర్‌డీఎస్ కెనాల్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. తుమ్మిళ్ల లిఫ్ట్ నుంచి, తనగల సమీపంలో గల ఆర్‌డీఎస్ డీ–23 వరకు ఈ పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్‌ను ఆనుకునే సర్వీస్ రోడ్డు ఉండటంతో పలు గ్రామాల ప్రజలు ఆ మార్గం గుండానే తిరుగుతుంటారు. ఏడు కి.మీ.ల దూరం ఉన్న ఈ పైప్‌లైన్‌ను రెండు వరుసల పైపులుగా వేశారు. పెద్ద వాహనాలు తిరగడం వల్ల రోడ్డుతో పాటు, పక్కనే ఉన్న పైప్‌లైన్‌కు కూడా ప్రమాదముందని గతంలోనే ‘సాక్షి’ చెప్పింది. ఆ రోడ్డుపై వాహనాలు తిరగకుండా అధికారులు అడ్డు కూడా వేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు మొత్తం కోతలకు గురైంది. ఆ కోతలు అలాగే పైప్‌లైన్ పక్కకు వెళితే కష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తుమ్మిళ్ల ద్వారా నీరు విడుదల జరుగుతుండటంతో ఆ రోడ్డుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. వాహనదారులు కూడా ఆ మార్గంలో ప్రయాణించవద్దని స్థానికులు సూచిస్తున్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



ఖాళీ కుర్చీలతో ఎంపీడీఓ కార్యాలయం

అలంపూర్ రూరల్: మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించాలని ప్రజలు కోరుతున్నారు. గురువారం ఉదయం 11 గంటల వరకు కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. అధికారుల కుర్చీలు ఖాళీగా ఉండడంతో కార్యాలయం వెలవెలబోయింది. ప్రజాపాలనలో భాగంగా ప్రజలు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు విధులకు హాజరుకాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

సమయ పాలన పాటిస్తున్నారు: ఎంపీడీఓ పద్మావతి

అధికారులు సమయానికే విధులకు వస్తున్నారు. గురువారం గ్రామాల సందర్శన కోసం వెళ్లారు. సిబ్బంది రావడం కొంతఆలస్యమై ఉండొచ్చు. ఒకరు లీవ్‌లో ఉన్నారు, మరొకరు ఆఫీస్ పనిపై వెళ్లారు. మిగితా వారు వచ్చారు. ఇక ముందు ఆలస్యంగా రాకుండా చర్యలు చేపడతాం.

మోస్ట్ ప్రోగ్రెసివ్ స్కూల్ ఆఫ్ 2024కు ‘ప్రయాగ్’



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మాసుమన్

అలంపూర్: నేషనల్ మోస్ట్ ప్రోగ్రెసివ్ స్కూల్ ఆఫ్ 2024కు ప్రయాగ్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మాసుమన్, డైరెక్టర్ మాధవిలు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో నేషనల్ స్కూల్ అవార్డ్ ది మోస్ట్ ప్రోగ్రెసివ్ స్కూల్స్ ఆఫ్ 2024 కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నేషనల్ అవార్డ్ ది మోస్ట్ ప్రోగ్రెసివ్ స్కూల్ ఆఫ్ 2024కు ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ఎంపికై నట్లు తెలిపారు. ఢిల్లీలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మాసుమన్ పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో దక్కిన అవార్డు విద్యార్థులను ఉత్తేజపర్చి శక్తివంతులు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

తూతూమంత్రంగా సోషల్ ఆడిట్



కొండాపురంలో సభ నిర్వహిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పనులకు రాని వారికి పేమెంట్లు చెల్లిస్తున్నట్లు ఉపాధి కూలీలు ఆరోపించారు. 2023–24కు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ, గ్రామాలలో సోషల్ ఆడిట్ చేపట్టారు. మండలంలోని 23 గ్రామాల్లో సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. కొన్ని చోట్ల పనులు చేయకున్న చేసినట్లు మస్టర్లు క్రియేట్ చేసి బిల్లులు కాజేశారు. మట్టిరోడ్ల పనులపై చేసిన పనులకే మళ్లీ బిల్లులు ల్యాండ్ లెవలింగ్ పనులపై బిల్లులు తీసుకున్నారు. ఈ పనులపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన లేకపోవడంతో అవకతవకలు చేసినట్లు సోషల్ ఆడిట్ బృందం తూతూ మంత్రంగా నిర్వహించినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజావేదికపై గ్రామాల్లో ఎలాంటి చాటింపు వేయకుండా గుట్టు చప్పుడుగా గ్రామసభలు నిర్వహించినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. అవకతవకలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ కృష్ణ మోహన్ వివరణ కోరగా, అలాంటిది ఏమీ లేదని, సోషల్ ఆడిట్‌పై ఏవైనా అనుమానాలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. గ్రామ సభలు చాటింపు వేయించి నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి

గద్వాల అర్బన్: ఆకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎక్బాల్ పాష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట నష్టపరిహారం అంచనా కోసం సంబంధిత అధికారులు పొలాలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి, రైల్వేస్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అందుబాటులో మందులు

గద్వాల క్రైం: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్కకాటుకు గురైన వారికి మందులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి సిద్దప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కురుస్తున్న వర్షాల దాటికి విష సర్పాలు, కీటకాలు సంచరిస్తాయని తెలిపారు. గ్రామీణా ప్రాంతాల్లోని వ్యవసాయ పనుల వద్ద పాము, తేలు కాటుకు గురైన సంఘటనలు ఉంటాయన్నారు. కుక్కలు ప్రమాదకరంగా ప్రజలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల్లో మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన క్రమంలో దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలన్నారు. నాటు వైద్యం కోసం ఎవరూ వెళ్లొద్దన్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి 5 గ్రాముల బంగారం, రూ.5వేల నగదు అపహరించిన సంఘటన గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సాయిజాదు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి తమ నివాసంలో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు తెరిచి బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించారు. ఉదయం నిద్రలేచి చూసే సరికి బీరువాలో వస్త్రాలు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అతివేగాన్ని నియంత్రించాలి

అయిజ: రోడ్డుపై వెళ్తున్న వాహనాల అతివేగాన్ని సంబంధిత అధికారులు నియంత్రించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కురిడి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు అతివేగంగా వెళ్లినందుకే స్కూల్ బస్‌కు ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సులు జోగుళాంబ గద్వాల జిల్లాలో రోడ్లపై అతివేగంగా వెళ్లడం వల్ల గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులతో సమీక్ష సమావేశం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గణేష్ ఉత్సవాలకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మంజుల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరు: మండలంలో సాయంత్రం 5 గంటల నుంచి 5.40 గంటల వరకు అరగంట పాటు భారీ వర్షం కురవడంతో 19.3 మి.మీ. నమోదైంది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వర్షం కురిసింది. వారం రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి కాయలు మునిగిపోయాయి. వరుస వర్షాల వల్ల పంటలకు మేలు కంటే నష్టామే ఎక్కువ ఉందని రైతులు వాపోతున్నారు.

వర్షాలతో పంటలకు దెబ్బ

మానవపాడు: మండలంలోని నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొర్విపాడు, గోకులపాడు, మానవపాడు, అమరవాయి, చెన్నిపాడు, జల్లాపురం, బోరవెల్లి, కలుకుంట్ల గ్రామాలలో కంది, మిర్చి పంటలు జోలెసి వాడిపోతున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువకుడి మృతి

ధరూరు: బతుకుదెరువు కోసం పత్తి పనికి వచ్చిన యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బూరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లకు చెందిన బోయ కేశన్న కుమారుడు నర్సింహులు(18) మూడు నెలల క్రితం సీడ్ పత్తి పనుల కోసం అన్నతో కలిసి బూరెడ్డిపల్లి వచ్చాడు. ఓ రైతు పొలంలో పనులు చేసేందుకు ఇక్కడే ఉన్నారు. బుధవారం రాత్రి 9గంటలకు ఎప్పటి లాగే భోజనం చేసి నిద్రపోయాడు. ఈ క్రమంలో నర్సింహులు నిద్రలోనే చనిపోయాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియడంతో బూరెడ్డిపల్లికి చేరుకున్నారు. తమకు ఎలాంటి అనుమానం లేదని రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు.